క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఆర్మూర్‌టౌన్‌: యువత మత్తుపదార్థాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని ఏసీపీ జగదీష్ చందర్ అన్నారు. మండలంలోని మంథని గ్రామంలో మంగళవారం కమ్యూనిటి కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామంలోఎవరైన అనుమానితులు తిరిగితే సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఉంటే దొంగతనాలను అరికట్టవచ్చన్నారు. అత్యవసర సమయంలో 100 డయల్ చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పోలీసు కవాతు నిర్వహించారు. అలాగే ఆధారాలు చూపని 37 బైకులను సీజ్ చేశారు. ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు, ఎస్సైలు గంగాధర్, అంజమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బాల్కొండ: మెండోరా మండల పరిధిలో పోలింగ్ కేంద్రాలను మోడల్ కండక్ట్‌కోడ్ సభ్యులు మంగళవారం పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున్న ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న రాజకీయ పార్టీల జెండాలను, ఫ్లెక్సీలను తొలిగించారు. తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎస్సై శ్రీనివాస్ ,ఎంపీవో సాయిలు, ఆర్‌ఐ సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో 'మేరీ మాటీ- మేరా దేశ్'



బాల్కొండ: ఢిల్లీలో నిర్మించనున్న అమరవీరుల స్మృతివనం నిర్మాణం కోసం బీజేపీ నేతలు నియోజకవర్గం పరిధిలో మేరీ మాటీ-మేరాదేశ్ కార్యక్రమం కింద మట్టిని సేకరించారు. ఈసందర్భంగా మంగళవారం సేకరించిన మట్టిని బాల్కొండకు తీసుకువచ్చి, కార్యక్రమాన్ని ముగించారు. నాయకుడు మల్కన్నగారి మోహన్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అన్ని మండలాల నుంచి తీసుకువచ్చిన మట్టిని బాల్కొండలో ఒక్కచోట చేర్చామన్నారు. అనంతరం ఢిల్లీకి పంపుతామన్నారు. నాయకులు శ్రీనివాస్ తదితరులున్నారు.

గల్ఫ్ కార్మికుల పేర్లు తొలగించొద్దు

బీమ్‌గల్: ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారి పేర్లను రేషన్ కార్డుల నుంచి తొలగించవద్దని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ బెహరన్ శాఖ అధ్యక్షుడు తోట రమేష్ ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న 15లక్షల తెలంగాణ వలస కార్మికులు పొట్టకూటి కోసం అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ కార్డులో పేరు లేకపోతే వారు సంక్షేమ పథకాలు కోల్పోతారని, ఈ కేవైసీ ప్రక్రియలో గల్ఫ్ కార్మికులకు ప్రత్యేక మినహాయింపు ఇవ్వాలని కోరారు.

ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ గ్రామంలో మంగళవారం వివిధ కుల సంఘాల ప్రతినిధులు వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానాలు చేశారు. ఈమేరకు అంబేడ్కర్ మాదిగ సంఘం, పద్మశాలీ సంఘం, శాలీవాహన కుమ్మరి సంఘం, వీసీ తండా, కేసీ తండాల సభ్యులు తీర్మాన ప్రతులను బీఆర్ఎస్ నాయకులకు అందజేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కమ్మర్‌పల్లి/వేల్పూర్: కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లోని వివిధ పాఠశాలల్లో మంగళవారం డీటీఎఫ్ రాష్ట్రస్థాయి మహా సభల వాల్ పోస్టర్లను సంఘ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక చైతన్యం కోసం ఈనెల 15, 16, 17వ తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డీటీఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక మహా సభలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సభలకు సంఘ సభ్యులు భారీగా తరలివచ్చి జయప్రదం చేయాలని తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజన్న, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

- ఆర్డీవో రాజాగౌడ్
- బోధన్‌లో అధికారులు, రాజకీయ పార్టీల నేతలతో సమావేశం



బోధన్ ఆర్డీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

బోధన్: నియోజకవర్గంలోని అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులందరూ ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలని బోధన్ నియోజకవర్గ ఆర్‌వో, ఆర్డీవో రాజాగౌడ్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్డీవో ఆఫీసులో ఆయన నియోజకవర్గ స్థాయి వివిధ శాఖల అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన విధివిధానాలను వెల్లడించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని స్పష్టం చేశారు. బోధన్ నియోజకవర్గంలో ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలు ఎవరైె ఉల్లంఘిస్తే, చర్యలుంటాయని వివరించారు. ఎన్నికలకు సంబంధించిన ర్యాలీ, సభలు, సమావేశాల నిర్వహణకు ఖచ్చితంగా నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డులకు ఉద్యోగులను నోడల్ అధికారులుగా, మండలస్థాయిలో ఎంపీడీవోలు, అర్బన్‌స్థాయిలో మున్సిపల్ కమిషనర్ నోడల్ అధికారులుగా నియమించామన్నారు. నియోజక వర్గానికి కలెక్టర్ మూడు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో సర్వేలైన్స్, స్టాటికల్ సర్వేలైన్స్ బృందాలు ఏర్పాటు చేశారని తెలిపారు. అధికారిక సమావేశాలు, సంక్షేమ పథకాల పంపిణీలు నిర్వహించకూడదని అధికారులకు సూచించారు. కోడ్ ఉల్లంఘనపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈసారి కొత్తగా సీ-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు. అధికారులు నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఏసీపీ కిరణ్ కుమార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, యకులు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయం

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి
- గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర



మంథనిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): రాబోయే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆర్మూర్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని చూసి మూడోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. సర్పంచ్ పుట్టింటి లింబారెడ్డి, జెడ్పీటీసీ సంతోష్, ఎంపీటీసీ గంగారాం పాల్గొన్నారు.

అభివృద్ధి నిరోధకులను దూరం పెట్టండి..

మాక్లూర్: అభివృద్ధికి ఆటంకం కల్గించే వారిని దూరంగా పెట్టాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని కల్లేడి గ్రామంలో మంగళవారం జరిగిన ప్రజా ఆశీర్వాద యాత్రలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కొందరు గ్రామంలో తనను అడ్డుకునే ప్రయత్నం చేయటం ఎంత వరకు సమంజసం అనేది ప్రజలే గుర్తించాలన్నారు. గతంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ భవనం స్థలంలో మళ్లీ సొసైటీ భవనం నిర్మాణం కోసం శిలాఫలకం ఏర్పాటు చేసి, ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించటానికి సిద్ధ చేశారు. ఎన్నికల కోడ్ ఉండగా కొందరు అభ్యంతరం తెలిపారు. అంతేకాకుండా కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ఎన్నికల కోడ్‌కు విరుద్ధమని వాటిని వెంటనే తొలగించాలని పోలీసులను కోరారు. పోలీసులు మరోచోటికి మార్చటంతో శాంతించి, వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యే యాత్ర ప్రశాంతంగా కొనసాగింది. వైస్ ఎంపీపీ సుక్కి సుజాత, స్థానిక బీఆర్ఎస్ నాయకులు మచ్చర్ల రమేష్, సుక్కి సుధాకర్, రాజు, బాషెట్టి సుమలత, రంజిత్‌కుమార్, మనీష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

'కాంగ్రెస్'తోనే ప్రజలకు న్యాయం



ఎడపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్): రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ రూపొందించిన ఆరు అంశాలను ప్రజలకు వివరించారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వ ప్రజలను మోసం చేసిందన్నారు. నాయకులు తాహెబ్, పులి శ్రీనివాసరావు, బిల్లా రామ్మోహన్, రాజ్ కుమార్, ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

రెంజల్: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ధనుంజయ్ మంగళవారం సొంతగూటికి చేరారు. గతంలో కాంగ్రెస్‌ను వీడిన ఆయన 2013లో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్‌లోని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి స్వగృహంలో మంగళవారం ఆయనకు మాజీ మంత్రి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. రాంచందర్, మోబిన్‌ఖాన్, జావిద్, సాయిరెడ్డి, రాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక



పెర్కిట్(ఆర్మూర్): కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని, కార్యకర్తలు పార్టీ వాగ్దానాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. ఆలూర్‌లో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రకటించిన ఆరు పథకాలను నెలరోజుల్లో అమలు చేస్తామన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి 40వేల నుంచి 50వేల మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నాయకులు ముక్కెర విజయ్, అన్వేష్ రెడ్డి, కోల వెంకటేష్, సాయి బాబాగౌడ్, గోర్తా రాజేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 22వ వార్డుకు చెందిన యువకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెర్కిట్‌లో వారికి వినయ్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ గెలిస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



మోర్తాడ్/వేల్పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచితంగానే బస్సు ప్రయాణం కల్పిస్తామని పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన మోర్తాడ్ నుంచి కమ్మర్‌పల్లి వరకు బస్సు ప్రయాణం చేసి, ప్రయాణికులతో మాట్లాడారు. కాంగ్రెస్‌ను రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని ఆయన ప్రయాణికులను కోరారు. కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న రైతుకూలీ సంఘ నాయకులు

రెంజల్: రాష్ట్ర ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతుకూలీ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఈమేరకు సంఘ నాయకులు రైతులతో కలిసి మంగళవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. రైతుల సెల్‌ఫోన్లకు రుణమాఫీ వచ్చినట్లు మెసెజ్‌లు రావడంతో వారు బ్యాంకులకు వెళితే, రాలేదంటూ బ్యాంకర్లు పేర్కొంటున్నారన్నారు. దీంతో రుణమాఫీ వచ్చిందందో రాలేదో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి క్వింటాలుకు రూ.3000 అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు పుట్టి నాగన్న, మిద్దె పెద్దులు, సంతోష్, బక్కన్న, లక్ష్మణ్, పార్వతి, రాజేశ్వర్, నషీర్, పోశెట్టి, మైసయ్య, సాయిలు, రవి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- బీజేపీ నాయకుడు వడ్డీమోహన్‌రెడ్డి



సాటాపూర్‌లో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

రెంజల్: రాష్ట్రంలో అవినీతి పాలనను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, త్వరలో బీజేపీ ప్రభుత్వం రాబోతోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 50 రోజుల్లో బీజేపీ అధికారం చేపట్టడం ఖాయమన్నారు. అనంతరం తాడ్‌బిలోలి, బోర్గాం, సాటాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌పై నమ్మకంలేకపోవడంతో ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు గోపికృష్ణ, వైస్ ఎంపీపీ యోగేష్, నాయకులు శ్రీనివాస్, సంతోష్, బుజ్జి, రమేష్, అజయ్ పాల్గొన్నారు.

కాజేసిన డబ్బులను రికవరీ చేయాలి



నందిపేటలో మాట్లాడుతున్న ఎంపీటీసీ సంజీవ్

నందిపేట్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని అన్నారంలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపట్టిన వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వకుండా సర్పంచు కాజేశారని, డబ్బులను రికవరీ చేయాలని ఎంపీటీసీ సంజీవ్ పేర్కొన్నారు. నందిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ వాకిడీ సంతోష్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం సంజీవ్ మాట్లాడుతూ.. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం డబ్బులు రూ. 6.5 లక్షలు లబ్ధిదారులకు ఇవ్వకుండా సర్పంచ్ సొంతానికి వాడుకున్నాడని అన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఆయా గ్రామాల్లోని సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. నందిపేటలో ఫైర్ స్టేషన్ ప్రారంభమయిందని ప్రజలు ఉపయోగించుకోవాలని ఎంపీపీ కోరారు. అధికారులు గంగారాం, కిరణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గౌతమి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రవీందర్ మంగళవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఉమ్మడి జిల్లాల ఖోఖో టోర్నమెంట్‌లో గౌతమి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వనపర్తి జిల్లాలో ఈ నెల 13 నుంచి 15వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొటుందన్నారు. ఈసందర్భంగా మంగళవారం పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్జాతీయ టెన్నికాయిట్ విజేతకు అభినందన



మాక్లూర్: మండలంలోని దాస్‌నగర్ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థిని త్రిష ఇటీవల సౌత్ ఆఫ్రికాలో జరిగిన 5వ అంతర్జాతీయ టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి పతకంతో స్వదేశానికి తిరిగొచ్చారు. ఈసందర్భంగా మంగళవారం ఆమెను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

అర్హులకు పథకాలు అందించాలి

నవీపేట: అర్హులకే సంక్షేమ పథకాలు అందించాలని మండలంలోని తుంగిని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి, నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో అర్హులైన వారికి కాకుండా అనర్హులకే దళితబంధు, గృహలక్ష్మిలను మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులకు పథకాలను వర్తింపజేయకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు.

చిందు కళాకారుల నూతన కార్యవర్గం

నవీపేట: చిందు కళాకారుల మండల స్థాయి నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చింతల సాయన్న, ఉపాధ్యక్షుడిగా పులింటి సాయిలు, కార్యదర్శిగా నరసింహులు, కోశాధికారిగా గడ్డం చందర్‌లను ఎన్నుకున్నారు.

ఎమ్మెల్సీని కలిసిన బోధన్ నాయకులు



బోధన్: ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో మంగళవారం బోధన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, బుద్దె రాజేశ్వర్, గోగినేని నరేంద్రబాబు ఉన్నారు.

కానిస్టేబుల్ పోస్టుకు ఎంపిక



మాక్లూర్: మండల కేంద్రానికి చెందిన మాచర్ల శ్రీధర్, సిరికొండ గణేష్, సిరిపురం కృష్ణ ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలను సాధించారు. దీంతో మంగళశారం మాక్లూర్ గ్రంథాలయ పాలకుడు నరేష్‌రెడ్డి, సర్పంచ్ అశోక్‌రావు, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు వారిని సన్మానించారు.

ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన యువకులు



బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఫణీంద్ర, శివసాయిలు స్పోర్ట్స్ కోటాలో ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు. దీంతో మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు వారిని సన్మానించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నియామకం/ఎన్నిక..

కిసాన్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా బాలకిషన్



ఆర్మూర్‌టౌన్: పట్టణ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బోడ మీది బాలకిషన్ నియామకమయ్యారు. ఈమేరకు మంగళవారం ఆయనకు నియామక పత్రంను రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు కోలా వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు గంగారెడ్డి అందజేశారు.

బోధన్ ఏపీపీగా శ్యాంరావు..



బోధన్: బోధన్ ఐదవ అదనపు జిల్లా సెషన్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది శ్యాంరావు నియామకమయ్యారు. ఈనెల 7న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాను మూడేళ్ల పాటు పదవీ బాధ్యతల్లో కొనసాగుతానని ఏపీపీ మంగళవారం తెలిపారు.

ఆశా యూనియన్..

వర్ని: మోస్రా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా యూనియన్ నూతన కమిటీ మంగళవారం సీఐటీయూ జిల్లా నాయకుడు నన్నేసాబ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా నన్నేసాబ్, అధ్యక్షురాలిగా ఆసియా (ఘనపూర్) ప్రధాన కార్యదర్శిగా రాణి (మోస్రా) కోశాధికారిగా శంకరమ్మ (చందూర్), ఉపాధ్యక్షురాలిగా సాత్విక (తిమ్మాపూర్), సహాయ కార్యదర్శిగా లక్ష్మి (కొత్తపేట్), కార్యవర్గ సభ్యులుగా నీలా, పద్మ, లక్ష్మి, రూప, బాలమణిలను ఎన్నుకున్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సాయిలు



వర్ని: మోస్రా మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సంఘం సాయిలు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈరెంటి లింగం మంగళవారం ఆయనకు నియామక పత్రం అందచేశారు. పీసీసీ డెలిగెట్ గంగాశంకర్, కొత్మికర్ లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, మోహన్, గంగాప్రసాద్, భీమేష్, పులి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో పాలకులు విఫలం



పీవైఎల్ జెండాను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ఆర్మూర్: యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారని, ఫలితంగా యువత చెడువ్యసనాలకు బానిసలవుతూ కుటుంబాలకు దూరం అవుతున్నారని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రదీప్ ఆవేదన వ్యక్తంచేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో మంగళవారం పీవైఎల్ జిల్లా మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు కిషన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో ప్రదీప్ మాట్లాడుతూ.. కుల, మతపరమైన భావజా లాన్ని యువకుల్లో నింపుతూ ఓట్ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. నాయకులు మారుతీగౌడ్, అనీష్, రవి, శ్రీనివాస్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	ది ఎక్సార్సిస్ట్(ఇంగ్లీష్) - 11.25, 2.00, 7.35 ; మంత్ ఆఫ్ మధు (తెలుగు) 4.35 మామా మశ్చీంద్ర (తెలుగు) - 10.10
స్క్రీన్-2 -	మ్యాడ్(తెలుగు)-12.20, 6.40, 9.30 స్కంద (తెలుగు) - 3.10
స్క్రీన్-3 -	రూల్స్ రంజన్(తెలుగు) - 12.00, 6.40, 10.00 ; 800(తెలుగు) - 03.20
స్క్రీన్-4 -	మామా మశ్చీంద్ర (తెలుగు)- 11.40 ; జవాన్ (తెలుగు) 2.50 ; స్కంద - 6.15 ; చిన్నా (తెలుగు) 9.45

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలి



భీమ్‌గల్: బీసీలకు రావాల్సిన వాటా ప్రకారం చట్టసభల్లో బీసీల రిజర్వేషన్లను తక్షణమే ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అబ్బగోని అశోక్‌గౌడ్ అన్నారు. భీమ్‌గల్‌లో మంగళవారం సంఘం నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అశోక్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అత్యధిక జనాబా కలిగిన బీసీలకు రాజ్యాధికారం రావాలంటే బీసీలందరూ బీసీలకే ఓటు వేయాలని తెలిపారు. మండలాధ్యక్షుడు గంగారాం, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.